క్లుప్తంగా

కోళ్ల ఫామ్ సందర్శన

చింతకాని: మండల పరిధిలోని ప్రొద్దుటూరు గ్రామంలో ఉన్నటువంటి కోళ్ల ఫామ్ లను మండల పశువైద్యాధికారి రామ్‌జీ సోమవారం సందర్శించారు. వైరస్ సోకి కోళ్లు మృత్యువాత పడుతుండటంతో ఫామ్ నిర్వాహకులకు తగు సూచనలు, సలహాలు చేశారు. కోళ్లకు వైరస్ సోకకుండా పాటించే జీవ నియంత్రణ పద్ధతుల గురించి వివరించారు. వైరస్‌తో మృతి చెందిన కోళ్లను ఆరు అడుగుల గుంట తీసి సున్నంతో కలిపి పూడ్చేయాలని సూచించారు.

సోషల్ మీడియాపై అవగాహన

తల్లాడ: ప్రతి ఒక్కరూ సోషల్ మీడియాపై అవగాహన కలిగి ఉండాలని డాన్‌బోస్కో ప్రిన్సిపాల్ ఫాదర్ ప్రదీప్‌రెడ్డి అన్నారు. మండలంలోని పినపాక డాన్‌బోస్కో పాఠశాలలో సోమవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు పిల్లలకు మొబైల్ ఫోన్ల వినియోగాన్ని తగ్గించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రేష్మాసుల్తానాకు జాతీయ పురస్కారం

కారేపల్లి: మండలంలోని వీఎస్పీ అనుబంధ మాధారం డోలమైట్ మైన్స్‌లో ల్యాబ్ టెక్నిషన్‌గా పని చేస్తున్న రేష్మాసుల్తానా జాతీయ స్థాయిలో ఉత్తమ మహిళా అవార్డుకు ఎంపికైంది. దీనికి సంబంధించి.. ఢిల్లీలో జరిగిన 35వ విప్స్ (ఉమెన్ ఇన్ పబ్లిక్ సెక్టార్) విభాగంలో కేంద్ర అధికారులు అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా తోటి ఉద్యోగులు ఆమెను అభినందించారు.

డబ్బులు చెల్లించాలి

బోనకల్: సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీ ఆపరేటర్లకు డబ్బులు చెల్లించాలని సోమవారం తహసీల్దార్ పున్నం చందర్‌కు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో కంప్యూటర్ ఆపరేటర్లు చైతన్య, కృష్ణ, రవి, బన్ని, వర్మ తదితరులు ఉన్నారు.

కేసు నమోదు

చింతకాని: మండలంలోని వందనం గ్రామానికి చెందిన యల్లావుల గణేష్‌పై సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గణేష్ తన తాత పేరు మీద ఉన్న వ్యవసాయ భూమిని గణేష్ అత్త పేరు మీద బదలాయింపు చేశారు. దీనికి గ్రామ మాజీ సర్పంచ్ యల్లావుల వెంకటేశ్వర్లు కారకుడని, వెంకటేశ్వర్లుపై వాట్సాప్ గ్రూపులో అసభ్యకర పోస్టులు పెట్టడంతో పాటు ఆదివారం అతన్ని అసభ్య పదజాలంతో దూషిస్తూ చంపుతామని బెదిరించాడు. వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

మహిళా గురుకులంలో టాస్క్ శిక్షణ

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లలో గల తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం టాస్క్ ఆధ్వర్యంలో బాలికలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్స్ అండ్ కమ్యూనికేషన్ డెవలప్‌మెంట్ ప్రతినిధి బాలూ ప్రవరాఖ్య బాలికలకు డిగ్రీ అనంతరం ఎదుర్కొనే పలు పోటీ పరీక్షల్లో విజయం ఎలా సాధించాలనే విషయంపై పలు సూచనలు చేశారు. సీజీసీ కోఆర్డినేటర్ రజినీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్ నవ్య, కోఆర్డినేటర్ కేపీ ఐశ్వర్య పాల్గొన్నారు.

హైవే పనుల అడ్డగింత

మధిర: మండలంలోని ఖాజీపురం సమీపంలో జరుగుతున్న నాగపూర్ - అమరావతి హైవే పనులను సోమవారం స్థానిక రైతులు అడ్డుకున్నారు. మాటూరు రెవెన్యూ పరిధిలో సుమారు 70మంది రైతులకు చెందిన భూములు నేషనల్ హైవే నిర్మాణంలో కోల్పోతున్నా.. ఎటువంటి నష్టపరిహారం చెల్లించడం లేదని రైతులు ఆరోపించారు. రైతులు రైతులు రామారావు, అప్పారావు తదితరులు కోరారు.

పంటలను కాపాడాలి

బోనకల్: బోనకల్ బ్రాంచ్ కెనాల్ పరిధిలోని చివరి భూములకు నీరందక ఎండిపోతున్న మొక్కజొన్న పంటలను కాపాడాలని సీపీఐ, సీపీఎం నాయకులు తహసీల్దార్ చందర్, ఎంపీడీఓ రమాదేవికి వినతిపత్రం అందించారు. సీపీఐ, సీపీఎం నాయకులు ఆనంద్‌రావు, నాగేశ్వరరావు మాట్లాడుతూ.. వారబందీ విధానాన్ని ఎత్తివేసి పంటలు కాపాడాలన్నారు.

డైరీ ఆవిష్కరణ

మధిర: మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ టీజీవో డైరీని కళాశాల ప్రిన్సిపల్ జయదాస్, టీజీవో జిల్లా నాయకులు గద్దల విక్రమ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సాంబయ్య, జూనియర్ కళాశాల అధ్యాపకులు షాహిన్ బేగం, కమల కుమారి, ఉపేంద్ర, కృష్ణ, నాగరాజు, జరీనా బేగం, ప్రగతి పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

కారేపల్లి: కారేపల్లిలోని ప్రభుత్వ స్థలం సర్వే నంబర్ 38లో బీసీ హాస్టల్ నిర్మాణానికి కేటాయించిన స్థలంలో.. కొంతమంది వ్యక్తులు చేపట్టిన అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని కోరుతూ.. కారేపల్లి గ్రామస్తులు సోమవారం తహసీల్దార్ సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు.

జర పైలం

శిథిల వంతెనలు.. ఇరుకు దారి

- దెబ్బతిన్న రక్షణ గోడలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- భయాందోళనలో వాహనదారులు



శిథిలమైన మేడేపల్లి సాగర్ వంతెన

ముదిగొండ: అవి దశాబ్దాల క్రితం నిర్మాణం చేపట్టిన వంతెనలు శిథిలమయ్యాయి. సింగిల్ వే కావడంతో అవి ఇరుకుగా ఉన్నాయి. చాలా చోట్ల రక్షణ గోడలు దెబ్బతిన్నాయి. వాటి అడుగు భాగంలో ఇనుప చువ్వలు తేలి బయటకు కనిపిస్తున్నాయి. ఆ వంతెలపై రాకపోకలు సాగించాలంటే ప్రయాణికులు భయాందోళనకు గురౌతున్నారు.

శిథిలావస్థకు చేరిన వంతెనలు..

ముదిగొండ మండలంలోని మేడేపల్లి సమీపంలోని సాగర్ కాలువపై ఉన్న వంతెన రక్షణ గోడలు ఓ వైపు కూలిపోయింది. మేడేపల్లి, యడవల్లి, కట్టకూరు, మాదాపురం గ్రామాలకు చెందిన ప్రజలు మండల, జిల్లా కేంద్రాలకు దీనిపై నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. చిరుమర్రి - కట్టకూరు సమీపంలో అవసరాలకు అనుగుణంగా దశాబ్దాల క్రితం బ్రిడ్జీలు నిర్మించారు. పమ్మి-నేలకొండపల్లి మండలం అనాసాగరం గ్రామాల మధ్య ఉన్న వంతెన రక్షణగోడలు దెబ్బతిన్నాయి. ఇరుకుగా ఉండడంతో రాకపోకలు సాగించడానికి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

భయం భయంగా ప్రయాణాలు..

ఈ వంతెనలపై నుంచి పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఇతర పనులపై వెళ్లే గ్రామస్తులతో పాటు ఇతర ప్రయాణికులు బిక్కు బిక్కు మంటూ ప్రణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తుంది. నిత్యం ఈ బిడ్జిలపై నుంచి బస్సులు, ట్రాక్టర్లు, లారీలు ఇతర వాహనాలు ప్రయాణాలు సాగిస్తుంటారు. ఎదురుగా ఎదైన వాహనం ఉంటే ఇక అంతే సంగతులు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఎటువంటి ప్రమాదం జరగకముందే వాటి స్థానంలో కొత్త వంతెనలను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



కట్టకూరు వద్ద విరిగిన రెయిలింగ్



చిరుమర్రిలో ఇరుకుగా మారిన వంతెన

ఇబ్బంది పడాల్సిందే..



నిత్యం ఏదో వాహనం ఈ ఇరుకు వంతెనల దగ్గర ఇబ్బందులు పడాల్సిందే. రైతుల ట్రాక్టర్లు బస్తాలతో వెళ్లాలన్నా, స్కూల్ బస్సులు వెళ్లాలన్నా, ఇబ్బందికరంగానే ఉంటుంది. ఎటువంటి ప్రమాదం జరకముందే అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలి.

– రెడ్డిమళ్ల సత్యనారాయణరెడ్డి, మాధాపురం

డిప్యూటీ సీఎంకు విన్నవించాం..



ముదిగొండ మండలంలోని చిరుమర్రిలో రెండు ఇరుకు వంతెనల సమస్యలను ఇటీవల డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు వివరించి వినతిపత్రం అందించాం. సాగర్ కాలువలపై పలు వాహనాలు ఇరుక్కుపోతున్నాయి. రైయిలింగ్‌లు విరిగి ప్రమాదస్థాయికి చేరుకున్నాయి.

– కోలేటి ఉపేందర్‌రావు, చిరుమర్రి

సైలో బంకర్‌ను తరలించాలి

సత్తుపల్లిరూరల్: సైలో బంకర్ నిర్మాణాన్ని నిలిపివేసి, తరలించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. దీని కాలుష్యంతో మండలంలోని కిష్టారం అంబేద్కర్‌నగర్, బీసీ కాలనీవాసులు అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. సైలోబంకర్ కాలుష్యం నివారించాలని ఎనిమిది రోజులుగా రిలే దీక్షలు చేపడుతున్నా సింగరేణి అధికారులకు, ప్రజాప్రతినిధులకు చీమకుట్టినట్టైనా లేదన్నారు. అనంతరం సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి మాట్లాడుతూ.. న్యాయమైన మీ సమస్యలపై పోరాటం చేయడానికి సీపీఎం అండగా ఉటుందని, స్థానిక నాయకత్వం, జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులతో సమస్యలు వివరించి పరిష్కార దిశగా అడుగులు వేస్తామన్నారు. ఈ న్యాయమైన పోరాటానికి కిష్టారం గ్రామప్రజలతో పాటుగా.. అన్ని రాజకీయ పార్టీలు మద్దతుగా నిలిచి బంకర్‌నిర్మాణాన్ని తొలగించే వరకు పోరాటం చేయాలన్నారు. తొలగించని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. సమస్యను ఎమ్మెల్యే మట్టా రాగమయి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని, మాజీ ఎమ్మెల్యే వెంకటవీరయ్య మద్దతు తెలపాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం డివిజన్ కమిటీ సభ్యుడు సత్యనారాయణరెడ్డి, సీపీఎం నాయకులు శ్రీనివాస్, సర్వేశ్వరరావు, రమేష్, కాంగ్రెస్ నాయకుడు అప్పారావు, ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు



స్పెషల్ టీం తో ఏడీఈ అనురాధ

మధిర: రానున్న వేసవికాలంలో అంతరాయం లేకుండా నిరంతరం విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రత్యేక టీంను ఏర్పాటు చేసినట్లు విద్యుత్ శాఖ ఏడీఈ అనురాధ తెలిపారు. నిరంతర విద్యుత్ సరఫరా కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక టీంతో సోమవారం ఆమె సమావేశమయ్యారు. మధిర టౌన్ సెక్షన్ పరిధిలో ఏర్పడే విద్యుత్ అంతరాయాలను పునరుద్ధరించేందుకు విద్యుత్ శాఖ ప్రత్యేక వాహన సౌకర్యంతో కూడిన ఆరుగురు సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో పట్టణ ఏఈ అనీల్ కుమార్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చింతకాని: ఖమ్మంలోని రామాలయం వద్ద ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల వలన మండలంలోని పందిళ్లపల్లి, నాగులవంచ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో ఉన్నటువంటి గ్రామాలకు మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ ఉమామహేశ్వరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

విధుల్లో చేరిన ఉపాధ్యాయులు



జాయినింగ్ ఆర్డర్లు అందిస్తున్న ఎంఈఓ పుల్లయ్య

బోనకల్: డీఎస్సీ 2008లో సెలెక్ట్ అయి బోనకల్ మండలానికి కేటాయించబడిన ముగ్గురు ఉపాధ్యాయులు సోమవారం విధుల్లో చేరారు. మండల విద్యాశాఖాధికారి దామాల పుల్లయ్య జాయినింగ్ ఆర్డర్లు అందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. నూతనంగా విధుల్లో జాయిన్ అయిన ఉపాధ్యాయులు విద్యారంగ అభివృద్ధికి మరింతగా కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులకు యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రామకృష్ణ, సద్దాబాబు, సీహెచ్ వెంకటేశ్వర్లు, వేణు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

ఎర్రుపాలెం మండలంలో..



ఎర్రుపాలెంలో విధుల్లో చేరిన ఉపాధ్యాయులు

ఎర్రుపాలెం: మండలంలోని విద్యావనరుల కేంద్రంలో సోమవారం ఇద్దరు 2008 డీఎస్సీ అభ్యర్థులకు ప్రభుత్వ ఆదేశాల మేరకు కాంట్రాక్ట్ ఉపాధ్యాయులకు ఎంఈఓ మురళీమోహన్‌రావు జాయినింగ్ ఆర్డర్లు అందించారు. దీంతో అభ్యర్థులు విధుల్లో జాయిన్ అయ్యారు. మీనవోలు ప్రాథమిక పాఠశాలకు ఆదినారాయణ, పెద్దగోపవరం పీఎస్‌కు కృష్ణవేణిలకు పోస్టింగ్ ఇచ్చారు. మండలంలో మరో ఆరు పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు మదన్‌మోహన్‌రెడ్డి, కోటేశ్వరరావు, సంగిరెడ్డి పాల్గొన్నారు.

నిరుపేదలకు దుస్తులు పంపిణీ

మధిర: రాయపట్నం గ్రామ సమీపంలో నివసిస్తున్న వలస కూలీలకు మధిరకు చెందిన మహాత్మా గాంధీ ఓల్డ్ క్లాత్ బ్యాంకు ఆధ్వర్యంలో సోమవారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామభక్త సీతయ్య కళా పరిషత్ కార్యదర్శి బాబ్జా మాట్లాడుతూ.. మధిర పట్టణంలోని ఆజాద్ రోడ్డులో నివసిస్తున్న ప్రముఖ సంఘ సేవకుడు, ఆరోగ్య పర్యవేక్షకుడు లంకా కొండయ్య నిర్వహిస్తున్న మహాత్మా గాంధీ ఉచిత పాత దుస్తుల సేకరణ కేంద్రం ద్వారా దాతల నుంచి దుస్తులను సేకరించి నిరుపేదలకు అందజేయడం అభినందనీయమన్నారు. వైద్య వృత్తితో పాటు సేవా కార్యక్రమాలను ప్రవృత్తిగా ఎంచుకొని సమాజ సేవకు కృషి చేస్తున్నారని తెలిపారు. మహారాష్ట్ర నుంచి మిర్చి కోసేందుకు వచ్చిన వలస కూలీలకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ.. ఎంతోమంది దాతలు స్వచ్ఛందంగా తన ఇంటికి వచ్చి ఇళ్లలో అదనంగా ఉన్న, వినియోగించిన దుస్తులను అందజేస్తున్నారని పేర్కొన్నారు. లంకా సేవా ఫౌండేషన్ వాలంటీర్లు శ్యామ్, సాయి, గోపి, ఖాదర్ పాల్గొన్నారు.



దుస్తులను పంపిణీ చేస్తున్న కొండయ్య బృందం

ముదిగొండలో లింగమంతుడి జాతర



లింగమంతుని దేవాలయానికి ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

ముదిగొండ: ముదిగొండలో లింగమంతుడి జాతర సోమవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ప్రదర్శనగా పారిశ్రామిక ప్రాంతంలోని లింగమంతుని దేవాలయానికి చేరుకుని బోనాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ప్రధాన సెంటర్‌లో నుంచి పారిశ్రామిక ప్రాంతంలోని ఆలయం వరకు యువతులు కోలాటం, నృత్యాలు చేస్తూ ప్రదర్శనంగా వచ్చారు. యాదవులు ఆలయంలో భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి తమ మొక్కులు చెల్లించుకున్నారు.

కేసీఆర్ జన్మదిన వేడుకలు

తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలు సెంటర్లలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



వైరా: కేక్ కట్ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



సత్తుపల్లిలో..



చింతకాని: లచ్చగూడెంలో..

పోస్టర్లు ఆవిష్కరణ

సత్తుపల్లిరూరల్: ఈ నెల 21న ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగు తెలంగాణ ప్రగతిశీల హమాలీ అండ్ మిల్ వర్కర్స్ యూనియన్ మహాసభలను జయప్రదం చేయాలని టీయూసీఐ జిల్లా నాయకుడు అమర్లపూడి శరత్ అన్నారు. ఈ సందర్భంగా సత్తుపల్లి సివిల్ సప్లై కార్మికులతో ప్రచారం చేసి పోస్టర్లు అవిష్కరించారు. కార్యక్రమంలో హమాలీలు కృష్ణ, రమేష్, వెంకటేశ్వరరావు, రాజు, వీరయ్య, రాంబాబు పాల్గొన్నారు.

నేడు గ్రామీణ వైద్యుల మహాసభ

కొణిజర్ల: 18న ఖమ్మంలో నిర్వహించే గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగేశ్వరరావు, వెంకటాచారి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సుదర్శనరావు, మణికుమార్, కొణిజర్ల నాయకులు పాల్గొన్నారు.

గొడవ పడకుండా చూడాలి

పెనుబల్లి: గురుకుల వసతి గృహాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు గొడవలు పడకుండా అధికారులు చూడాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బెజవాడ సాయిశేషు అన్నారు. మండలంలోని కుప్పెనకుంట్ల సోషల్ వెల్ఫేర్ బాయ్స్ పాఠశాల మరియు కళాశాలలో ఇంటర్ సెంకడియర్ విద్యార్థులు.. ఫస్టియర్ విద్యార్థిపై దాడి చేయడాన్ని ఆయన ఖండించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి మణికంఠ, మండల అధ్యక్ష, కార్యదర్శులు భానుశ్రీకర్, స్వామి, ప్రేమ్, తరుణ్, కార్తీక్ పాల్గొన్నారు.

సన్మానం..

పెనుబల్లి: గోరు బంజారా జాతీయ రత్న అవార్డు గ్రహీత దశరథ్ రామా నాయక్‌ను వీయంబంజర్ సోమ్లానాయక్ తండా నాయకుడు మంగూ నాయక్ ఆధ్వర్యంలో సంత్ సేవాలాల్ మందిరంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు కృష్ణ నాయక్, శ్రీను నాయక్ పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి ఏరియా ప్రభుత్వాస్పత్రిలో డివిజన్‌లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సోమవారం కంటి వైద్య పరీక్షలు ప్రారంభించారు. దీన్ని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ టి.సీతారాం, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ప్రారంభించారు. డివిజన్‌లోని 726మంది విద్యార్థులకు వచ్చే నెల 15వ తేదీ వరకు ఆప్తాలమోస్కోప్ మిషన్‌తో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యులు అజహర్, సాయి మణి, సదానందం, వైద్య సిబ్బంది రాధాకృష్ణ రుమారి, హైమావతి, రామారావు, నాగరాజు, శ్రీనివాస్, పార్వతి పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ సీతారాం, ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

వితరణల వెల్లువ..

స్వచ్ఛంద సేవకుడి ఔదార్యం



సునీతకు కృత్రిమ కాలు ఏర్పాటు చేసిన దృశ్యం

కారేపల్లి: రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయిన ఓ నిరుపేద మహిళలకు విజయవాడకు చెందిన స్వచ్ఛంద సేకుడు శ్రీనివాసరావు రూ.లక్ష వ్యయంతో కృత్రిమ కాలు ఏర్పాటు చేశారు. మండలంలోని గాంధీనగర్‌కు చెందిన సునీత రెండు సంవత్సరాల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎడమ కాలు విరగింది. దీంతో వైద్యులు కాలును తొలగించారు. వారునిరుపేద కుటుంబం కావడంతో.. తుడుందెబ్బ నాయకుడు కోటేశ్వరరావు విషయాన్ని ఖమ్మం టాస్క్‌ఫోర్స్‌లో పనిచేస్తున్న ఎస్సై పుష్పాల రామారావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎస్సై స్నేహితుల ద్వారా విషయం తెలుసుకున్న శ్రీనివాసరావు ఆర్థిక చేయూతనందించి కృత్రిమ కాలు ఏర్పాటు చేశారు.

వైద్యఖర్చులకు ఆర్థిక సాయం..

కొణిజర్ల: మండల కేంద్రంలో కొణిజర్ల సమత సూపర్ జెమ్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో రమణ ఆయాగ పనిచేస్తుంది. ఆమె అనారోగ్యంతో బాధపడుతుండగా.. విషయం తెలుసుకున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు రూ.10 వేల విరాళం, 25 కేజీల బియ్యం, నిత్యావసరాలు అందించారు. వీటిని ప్రిన్సిపాల్ కొనతం ఉమా శంకర్, కొణిజర్ల మాజీ సర్పంచ్ రామారావు చేతుల మీదుగా ఆయా కుటుంబ సభ్యులకు అందించారు.

పరీక్ష సామగ్రి వితరణ..



విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న దృశ్యం

కొణిజర్ల: మండలంలోని పెద్దగోపతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం పరీక్ష సామగ్రి వితరణ చేశారు. చేతన ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రవాస భారతీయులు వెనిగళ్ల రవికుమార్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కోపెల మార్క్, ఉపాధ్యాయులు నర్సింహారావు, షేక్ రంజాన్ పాల్గొన్నారు.

క్వింటా మిర్చికి రూ.25 వేలు ఇవ్వాలి



బోనకల్: మిర్చి కల్లంలో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న రైతుసంఘం నాయకులు



వైరా: వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం



తల్లాడ: గోపాలపేటలో..

వైరా/ఏన్కూరు: క్వింటా మిర్చికి రూ.25 వేలు మద్దతు ధర నిర్ణయించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు నా ఫెడ్, మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. మిర్చి రైతుల సమస్యలపై వైరాలోని బోడేపుడి భవనంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో వాల్‌పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. పంట సాగుకు రూ.లక్షలు పెట్టుబడులు పట్టిన మిర్చి కనీస ధరలు లేక ఆర్థికంగా నష్టపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా ఏన్కూరు మండలంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల నాయకుడు ఏర్పుల రాములు రైతు కల్లాల్లోని పంటను పరిశీలించి మాట్లాడారు. ఖమ్మంలోని వ్యవసాయ మార్కెట్ వద్ద తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే రైతు మహాధర్నాను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు కాలసాని రాములు, రాంబాబు, పుల్లయ్య, మల్లెంపాటి రామారావు, చింతనిప్పు చలపతిరావు, బొంతు సమత, దొడ్డాపనేని కృష్ణార్జున్‌రావు, నరికొండ అమరేంద్ర, వల్లమూడి మధు, పాసంగులపాటి చలపతిరావు పాల్గొన్నారు.

పెనుబల్లి/తల్లాడ/కల్లూరురూరల్: మద్దతు ధరకు మిర్చి కొనుగోలు చేయాలని రైతు సంఘం మండలాధ్యక్షుడు నల్లమల ఆరుణ్ ప్రతాప్, మండల కార్యదర్శి అంజయ్య, సహాయ కార్యదర్శి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా రైతులు పెనుబల్లిలోని రంగారావు బంజర్‌లో, తల్లాడలోని గోపాలపేటలో, కల్లూరులో మిరప తోటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. మిరప కాయలను చూపిస్తూ కల్లాల్లో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం మిర్చిరేటు రూ.1300 ఉందని, దీనిని రూ.25వేలకు పెంచాలన్నారు. కార్యక్రమంలో వ్య.కా.సం సభ్యుడు తన్నీరు కృష్ణార్జునరావు, రైతులు రాములు, రాంబాబు, పుల్లయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు తిరుపతిరావు, నాయకులు సంబర మూర్తి, సత్యం, రామారావు, ఒరుగంటి రామకృష్ణ, వెంకటేశ్వర్లు, సత్యం, వెంకటన్న, ముప్వ వెంకటేశ్వరరావు, మోహన్‌రావు, వెంకటయ్య, నాగేశ్వరరావు, గోపాల్‌రావు, సత్యనారాయణ, వెంకటయ్య, సత్యం, అర్జునరావు, ముత్తారావు, కిషోర్, రాంబాబు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

బోనకల్/ఎర్రుపాలెం: బోనకల్ మండల పరిధిలోని లక్ష్మీపురం, తూటికుంట్ల గ్రామాలతో పాటుగా ఎర్రుపాలెం మండలంలోని భీమవరం, అయ్యవారిగూడెం గ్రామాల్లో తెలంగాణ రైతుసంఘం బృందం మిర్చి తోటలను సోమవారం పరిశీలించింది. రైతుల గోడు ఆలకించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా నాయకులు వీరయ్య, మండల రైతు సంఘం అధ్యక్షుడు కోటేశ్వరరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాంబాబు మాట్లాడుతూ.. నేడు నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు నాగేశ్వరరావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు నాగేశ్వరరావు, రమేష్, ఉమ, రాధాకృష్ణ, వెంకటనర్సయ్య, నరేష్, రామకృష్ణ, డీవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ప్రభాకర్, నాయకులు శ్రీనివాసరావు, నారాయణ, మోక్షానందం, రామారావు, రంగారావు, వెంకటేశ్వరరావు, బాపయ్య, గోపి తదితరులు పాల్గొన్నారు.